

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ గుర్తింపు పొందిన పారా మెడికల్ కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి దేవి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. శిక్షణ కోర్సు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశం కొరకు అర్హులైన మహిళ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తుల కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా 12వ తరగతి లేదా ఇంటర్మీడియట్ పరీక్షలో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యరుధులు రాష్ట్ర ఓపెన్ స్కూల్ లేదా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గుర్తింప బడిన స్కూల్ విద్యార్థులు ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత, ఆసక్తి కల అభ్యర్థులు ఉచిత కోట ప్రవేశం కొరకు www.apsahpc.co.inలో పొందు పరిచిన దరఖాస్తు ఫారం పూరించి ఇతర విద్యార్థుల నమూనా కాపీలతో, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 మాత్రం డబ్బు రూపంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, రెడ్డిగుంట, చిత్తూరు కార్యాలయంలో ఆగస్టు 6వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్‌లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు నాగరాజులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా స్వీపర్లు, యూనిఫామ్, చెప్పులు, నూనె ఇవ్వకపోవడం వల్ల పనిచేయడం చాలా కష్టతరంగా మారిందని తెలిపారు. కార్పొరేషన్ విస్తీర్ణం పెరగడంతో రిటైర్డ్ అయిపోయిన వారి స్థానంలో ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో కార్మికులపై పనిభారం పెరుగుతున్నదన్నారు. ఇంక్రిమెంట్లు అమలు చేయాలని ఆప్కాస్‌లో పని చేసిన కార్మికులు చనిపోయిన కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన వారికి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు విన్న అధికారులు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



'అధికార' అరాచకం

చిరుద్యోగులపై వేధింపులు

రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి

'దాడులకు ప్రతిదాడులు సరికాదు.. సామరస్యపూర్వకంగా వ్యవహరించండి.. తప్పు చేసేవారిపై చర్యలకు చట్టాలున్నాయి.. ప్రతీకార చర్యలకు పూనుకోవద్దు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే సూచిస్తున్నప్పటికీ అధికార పార్టీ దాడులు పెట్రేగిపోతూనే ఉన్నాయి. రాష్ట్రంలో అధికార బదిలీ జరిగినప్పటి నుంచి చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయి. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల చేత రాజీనామాలు చేయించి, వారి స్థానంలో తమ పార్టీకి చెందిన వారిని నియమించుకోవాలనే ఉద్దేశంతో వేధింపులకు పాల్పడుతున్నారు.


ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు మచ్చుకు కొన్ని......శ్రీకాళహస్తి పట్టణం ఎంపేడులో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న సౌజన్యను తొలగించేందుకు టిడిపి నాయకులు పి. ఈశ్వర్‌రెడ్డి వేధింపులకు పాల్పడుతున్నారు. పుత్తూరు పట్టణం భవానీ నగర్ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న పి.లీలావతిని ఉద్యోగం నుంచి తొలగించాలని కౌన్సిలర్ ఒత్తిడి చేస్తున్నారు. పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు సాయిలక్ష్మి, సత్యవేణిలను ఇదే విధంగా టిడిపి నాయకులు వేధిస్తున్నారు. నారాయణవనం మండలంలో ఇద్దరు ఫీల్డ్‌అసిస్టెంట్లు తంగరాజు, కుమ్మర కుప్పయ్యలను నిర్దాక్షణ్యంగా తొలగించారు. సత్యవేడులో మధ్యాహ్న భోజన వర్కర్లు లీలావతి, వసంతమ్మను విధులకు రావద్దని చెబుతున్నారు. ఈ విధంగా తిరుపతి జిల్లాలో 32 మండలాల పరిధిలో దాదాపు వెయ్యి మందికి పైగా చిరుద్యోగులతో రాజీనామాలు చేయించాలని నెల రోజులుగా అధికారపార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఒక్క శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే 37 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. తమ మాట వినకపోతే ఊరి నుంచి వెలివేస్తామని హెచ్చరిస్తుండటం గమనార్హం. దీంతో దిక్కుతోచని స్థితిలో చిరుద్యోగులు సిఐటియును ఆశ్రయించారు.

'ఆశా' ఉద్యోగమే ఆధారం : కృష్ణవేణి, బాలాయపల్లి



మాది వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం. సుబ్రమణ్యం గ్రామంలో ఆశా వర్కర్‌గా 18 ఏళ్లుగా సేవలందిస్తున్నాను. నాకు ముగ్గురు కుమార్తెలు. భర్త వ్యవసాయ కార్మికుడు. చర్మ సంబంధిత క్యాన్సర్‌తో బాధపడుతున్న ఇద్దరు కుమార్తెలల్లో ఒకరు మృతి చెందారు. చిన్న కుమార్తె ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. నేను పనిచేస్తేనే నా కుటుంబం ఆకలి తీరుతుంది. అయితే ఇరవై రోజులుగా మా గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు నన్ను ఉద్యోగం నుంచి తీసేయాలని పట్టుబడుతున్నారు. మెడికల్ ఆఫీసర్, మండల అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. విధులకు సక్రమంగా రావడం లేదని నింద వేస్తున్నారు. ఊళ్లో ఒక్కరంటే ఒక్కరు నాపై వ్యతిరేకంగా చెప్పలేదు. నన్ను తీసేసి వాళ్లోళ్లని పెట్టుకోవాలని చూస్తున్నారు.

వేధింపులు మానుకోండి : కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు



రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశా, సంఘమిత్ర, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీమ్ వర్కర్లపై టిడిపి నాయకులు రాజకీయ వేధింపులను మానుకోవాలి. రాష్ట్రంలో రాజకీయ వేధింపులు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదే పదే ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పకపోతే కార్మికులందర్ని ఐక్యం చేసి పోరుబాట పడతాం.

ఎస్వీయూ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - క్యాంపస్




శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంచార్జ్ ఉపకులపతిగా ఆచార్య సిహెచ్. అప్పారావును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. ఆచార్య అప్పారావు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపకులపతి గా పదవీబాధ్యతలు స్వీకరించారు. వీరు ఎస్వీయూలో 1989 నవంబర్లో బయోకెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరారు. 2006 లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. యస్వీయూలో డి.ఓ. ఏ. డైరెక్టర్ గా, శాఖాధిపతిగా , బి. ఓ. యస్. ఛైర్మన్ గా పనిచేశారు. సి.డి.సి. డీన్ గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. ఎస్వీయూలో సీనియర్ ఆచార్యులైన వీరిని ప్రభుత్వం ఇంచార్జ్ ఉపకులపతిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ డా.చంద్రయ్య, ఆచార్య భూపతినాయుడు, ఆచార్య అమర్నాథ్, ఆచార్య త్యాగరాజు, విద్యార్థి సంఘ నాయకులు ఆనందగౌడ్, హరికష్ణ యాదవ్ తదితరులు అభినందించారు.

ఆచార్య ఉమ బాధ్యతలు స్వీకారం



శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ కి చెందిన ఆచార్యులు ప్రొఫెసర్ వి.ఉమ శుక్రవారం ఉదయం వైస్ ఛాన్సలర్ చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.ఉమ 1983లో విశ్వవిద్యాలయం స్థాపించినపుడు లెక్చరర్‌గా జాయిన్ అయ్యారు. ఈమె టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుండి ఎమ్ ఎస్ డబ్ల్యూ పూర్తి చేసి, విదేశాలలో పీహెచ్డీ పూర్తి చేశారు. ముప్పైఐదు సంవత్సరాల పైచిలుకు, బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అమ్మాయిల భవిష్యత్తు కోసం స్థాపించిన యూనివర్సిటీ పురోగతికి కషి చేస్తానని, రూసా ద్వారా వచ్చిన నిధుల ద్వారా యూనివర్సిటీని అభివద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజనీ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.గీతావాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా ఆచార్య భూపతి నాయుడు



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా దూరవిద్య విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న ఆచార్య యం. భూపతి నాయుడును నియమిస్తూ ఇన్చార్జ్ విసి ఆచార్య అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం 4.45 గంటలకు ఆచార్య భూపతి నాయుడు రిజిస్ట్రార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆచార్య భూపతి నాయుడు 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఎస్వీయూలో చేరారు. 27 సంవత్సరాల బోధనానుభవం గల భూపతి నాయుడు వివిధ కమిటీల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన వారిని ఎస్వీయూలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , డీన్లు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలి : డిఎఫ్ఒ

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

మండలంలోని కొట్టాల హౌసింగ్ కాలనీ సమీపంలో అటవీ ప్రాంతం నందు చిరుత పులి సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి డిఎఫ్ఒ సతీష్ రెడ్డి కోరారు. శుక్రవారం కొట్టాల పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించారు. సోషల్ మీడియాలో చిరుత సంచారం పై వైరలైన వీడియోకు స్పందించి వెంటనే అటవీశాఖ అధికారులను కొట్టాల గ్రామానికి పంపి ప్రజలను అప్రమత్తం చేశానని డిఎఫ్ఒ సతీష్ రెడ్డి తెలిపారు. గొర్రెలు, మేకలు, పశువుల కాపర్లు పశువులు తీసుకుని మేత కోసం అడవుల్లోకి వెళ్లరాదని ఆయన సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ఎవరు బయటకు రాకూడదని గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. కొట్టాల అటవీ ప్రాంతంలో అటవీ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా ప్రత్యేకమైన పదిమందితో కూడిన టీం ను ఏర్పాటు చేసి రాత్రింబగళ్లు గస్తీలు తిరిగేటట్లు ఏర్పాటు చేశామన్నారు. చిరుతపులి సంచారాన్ని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలతో వీడియోలు చిత్రీకరిస్తున్నామని, అలాగే అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఎవరూ భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని, అటవీ శాఖ సిబ్బంది మీకు అందుబాటులో ఉంటారని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వీలైనంత త్వరగా చిరుత సంచారాన్ని గుర్తించి బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధిస్తామన్నారు. ఎఫ్.ఆర్.ఓ.మాధవి, డి.ఆర్.ఓ. వేణు ఎఫ్.ఎస్.ఓ.చైతన్య, ఎఫ్.బి.ఓ. అనిత, రజిని, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరును ఎంఎస్‌ఎంఈ హబ్‌గా ఏర్పాటుకు కృషి

- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:



చిత్తూరును ఎంఎస్‌ఎంఈ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమీక్షిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు కావలసిన మార్గాలను అన్వేషిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆ విధమైన కార్యచరణ చేపడితే చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగులు, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్పీ మణికంఠ చందోలును పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ శుక్రవారం ఎస్పీ బంగ్లాలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్పిగా వి.ఎన్.మణికంఠ చందోల్ భాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి కలిసిన ఎమ్మెల్యే మురళిమోహన్ కలిశారు. పూతలపట్టు నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. దీనికి అవసరం అయ్యే సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. వీటితో పాటుగా గత కొంత కాలంగా పూతలపట్టు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను గురించి ప్రస్తావించారు. ఆయనతో పాటు పలువురు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అడిగోపుల మృతి సాహితీ లోకానికి తీరనిలోటు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రముఖ రచయిత అడిగోపుల వెంకటరత్నం (79) మృతి అభ్యుదయ సాహిత్యానికి తీరని లోటని సాహితీ స్రవంతి, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నివాళి అర్పించింది. యాభై ఏళ్లుగా ఆయన సాహితీ లోకానికి అభ్యుదయ రచనలను అందించారన్నారు. అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం ఉదయం తిరుపతి లోని స్వగృహంలో కన్నుమూశారు. వేమన విజ్ఞాన కేంద్రం, సాహితీస్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సమకాలీన సమస్యలకు కష్టజీవుల కలం అడిగోపుల అని కీర్తించారు. నివాళి అర్పించిన వారిలో ఒ.వెంకటరమణ, సాయిలక్ష్మి, టెంకాయల దామోదరం, మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ, గురునాథంలు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో ఆదివారం జరగనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

శ్రీ చైతన్యలో 'గ్రీన్‌ర్యాలీ'

ప్రజాశక్తి -తిరుమల: టి.ఎస్.ఎన్. పురం శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం గ్రీన్ ఇండి యా మిషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులచే తయారు చేయబడిన గ్రీన్ ఇండియా మిషన్ స్లోగన్ ఫ్లేకార్డ్స్ ను ప్రదర్శిస్తూ పాఠశాల ప్రాంగణం నుండి కపిల్ తీర్థం నంది సర్కిల్ వరకు విద్యా ర్థుల చే ర్యాలి చేపట్టారు. ఏ.జీ.ఎం సురేష్, పాఠశాల హెచ్ఎం లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ కే.మోహన్ బాబు స్వచ్ఛత, పరిశుభ్రతకు సంబంధించిన పట్టణ నమూనాను మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌కు సమర్పించారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని గాండ్లపల్లి, సంతపేట, బిఎస్ కన్నన్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చిందని, తిరిగి మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యా బోధన అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు కర్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాల్లో రాణించాలని కోరారు. తల్లికి వందన పేరిట విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15వేలు ప్రభుత్వం జమ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నగర కమిషనర్ అరుణ, ఎంఈవో సెల్వరాజ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

డెంగీ నివారణ చర్యలు విస్తృతం

- డీఎంహెచ్‌వో ప్రభావతి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: డెంగీ నివారణ చర్యలు విస్తృతం చేసి ప్రజల్లో అవగాహన తీసుకొస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి అన్నారు. పరిశుభ్రత పాటిస్తూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేందుకు ప్రజలందరూ అవగాహనతో మెలగాలని సూచించారు. శుక్రవారం నగరంలోని ప్రశాంత్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో "ఫ్రైడే డ్రైడే కార్యక్రమం"పై విస్తృత తనిఖీలు చేపట్టారు. జులై నెలాఖరు వరకూ డెంగీ నివారణ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు.

ఎంపీ, మాజీ ఎంపీలపై కేసు నమోదు

ప్రజాశక్తి-పుంగనూరు: రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పివీ మిథున్ రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్పలపై హత్యాయత్నం, పలు సెక్షన్లపై పుంగనూరు పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. గురువారం మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటి వద్ద జరిగిన అల్లర్ల కేసులో ఇరు వర్గాలు ఫిర్యాదు చేసుకోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీకి చెందిన సయ్యద్ సుహేల్ బాషా ఫిర్యాదు మేరకు ఏ1గా ఎంపీ మిథున్ రెడ్డి, ఏ2 మాజీ చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు ఎన్.రెడ్డప్పపైన, మరో 34మంది పైన కేసులు నమోదు చేశారు. వీరందరి పైన హత్యయత్నంతో పాటు పలు సెక్షన్ల మీద కేసులు నమోదైయ్యాయి. బసనేపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన మరో 35మంది పైన కేసులు నమోదు కాగా మొత్తం వైసీపీ చెందిన 69మంది ఈ కేసులో ఉన్నారు. కాగా చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప ఫిర్యాదు మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు 9మంది పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

పకడ్బందీగా 'స్టాప్ డయేరియా'

- జిల్లా అధికారి డాక్టర్ అనిల్ కుమార్



ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన యాదమరి ప్రాథమిక పాఠశాల పరిధిలోని 70కొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది చేపడుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. అదే గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, ఆ తరువాత ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సూపర్వైజర్ లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్‌పిహెచ్‌ఓ దుర్గా ప్రసన్న, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మామిడి కోత అనంతరం యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమోజిపల్లి గ్రామ సమీపంలో మామిడి కోత అనంతరం చేపట్టాల్సిన చర్యల గురించి ఉద్యానవన శాఖ అధికారి సాగరిక ఆధారంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కోత అనంతరం యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. చెట్ల మొదల్లో బయోటెక్ రాగాల వేప నూనెను పిచికారి చేసుకోవాలన్నారు. ఎండుకొమ్మలను కత్తరించి చెట్ల నాణ్యతలను పెంచుకోవాలని సూచించారు. చెట్లకు నాలుగడుగుల పాదులు చేపట్టి నీరు నిల్వ ఉండే విధంగా చూడాలని వివరించారు. కొమ్మలు కత్తిరించుకునేందుకు కట్టర్లు ఉపయోగించాలన్నారు. ఇందువల్ల చెట్ల దెబ్బతినకుండా నాణ్యత విధంగా ఉంటుంది అన్నారు. కార్యక్రమంలో పిడి సుబ్రహ్మణ్యం పలువురు రైతులు పాల్గొన్నారు.

'సైకో' ప్రేమలు



తిరుపతి జిల్లాలో తాజా ఘటనలు

గంజాయి మత్తులో యువత


అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

ప్రజాశక్తి – తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లాలో గంజాయి మత్తులో యువత జోగుతోంది. ఆ మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా 'సైకో'ల్లా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో తాజాగా జరిగిన గూడూరు, దొరవారిసత్రం, తిరుపతి రాయల్‌నగర్ ఘటనలను పరిశీలిస్తే గంజాయి మత్తులో మానవమృగాల్లా వ్యవహరించారని విచారణలో తేలింది. రెండు రోజుల క్రితం సూళ్లూరుపేట నియోజకవర్గంలో దొరవారిసత్రం పంచాయతీ నెలబల్లి గ్రామంలో ఓ సైకో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. అలాగే గూడూరు పట్టణంలో రౌడీషీటర్ వినయ్ ఓ విద్యార్థిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కాలేజీకి బయల్దేరిన ఆ విద్యార్థిని బలవంతంగా ఆటోలో తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో అత్యాచారం చేశాడు. ఆ అవమానం భరించలేని ఆ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం నెల్లూరు ఆస్పత్రిలోచికిత్స పొందుతోంది. నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి తిరుపతి నగరంలోని రాయల్‌నగర్‌లో శ్రీను అలియాస్ శ్రీనివాస్ పక్కింట్లో ఓ అమ్మాయిని మూడేళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అతని వికృతచేష్టలు భరించలేక అమ్మాయి తండ్రి బిబిఎ చదువుకోసం న్యూఢిల్లీలో చేర్పించారు. సెలవుల నిమిత్తం రెండు రోజుల క్రితం ఆ అమ్మాయి ఇంటికి రావడంతో తాను ప్రేమించిన అమ్మాయిని తనకు దూరం చేస్తారా? అంటూ పథకం ప్రకారం ముసుగు వేసుకుని వచ్చి అమ్మాయి నాయనమ్మ జయలక్ష్మి (70)ని కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అంతటితో ఆగని ఉన్మాది శ్రీను ఇద్దరు అమ్మాయిలపైనా కత్తితో దాడికి యత్నించాడు. ఇందులో ఓ అమ్మాయికి గొంతుపై గాయం కావడంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌పి సుబ్బరాయుడు సిసి ఫుటేజీలను పరిశీలించారు. పరిస్థితులను చుట్టుపక్కలవారిని అడిగి తెలుసుకున్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడింది శ్రీనివాసులేనని నిర్ధారణకు వచ్చారు. శ్రీనివాసులు గత ఐదేళ్లుగా జులాయిగా తిరుగుతున్నాడు. తండ్రి చనిపోవడంతో దుబాయ్‌లో ఉన్న అన్న పంపే డబ్బుతో విలాసాలకు పాల్పడేవాడు. మద్యానికి, గంజాయికి బానిసయ్యాడు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఐదు బృందాలు అతనిని పట్టుకోడానికి వెళ్లాయి. నిందితుడు శ్రీనివాసులును హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విద్యార్థినిపై అత్యాచార కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్



విద్యార్థినిపై అత్యాచారం కేసులో నిందితున్ని అరెస్టు చేశారు. శుక్రవారం గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో డి.ఎస్పీ సూర్య నారాయణ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గూడూరు రెండో పట్టణానికి చెందిన బాధితురాలు ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోందన్నారు. ఒకటో పట్టణానికి చెందిన రౌడీ షీటర్ మహేష్ బుదవారం బాధితురాలిని కత్తి తో బెదిరించి ఆటోలో తీసుకెళ్లి గాంధీనగర్ ప్రాంతంలోని నిర్జీవ ప్రాంతంలో అత్యాచారం చేశాడు. బాధితురాలు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. శుక్రవారం గూడూరు పట్టణ పరిధిలోని తాళమ్మ గుడి సమీపంలో నిందితున్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. అనంతరం కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసును త్వరిత గతిన ఛేదించిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సీఐ పాపారావు, ఎస్.ఐ శ్రీహరి బాబు పాల్గొన్నారు.

'పాఠశాలల అభివృద్ధికి కృషి'

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య బోధనకు కృషి చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా సంవత్సరానికి రూ.15వేలను పిల్లల తల్లుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీతాపతి, సలాం సాబ్, అక్బర్ సాబ్, రఫీ, నయాజ్, అనీఫ్, మంజునాథ్, ఆదిల్, ఎంఈఓ2 నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల అందజేత

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం కంగుంది గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం చేతుల మీదుగా ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపడం ప్రతి ఒక్కరూ బాల్యం నుంచి అలవాటు చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తు తరాలు అందరూ సమానమే అన్న ధోరణిలో ఎదగాలన్న ముఖ్య ఉద్దేశంతో సీఎం చంద్రబాబు విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసినట్టు తెలిపారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా మొక్కజొన్న విత్తనాలు అందించడం జరిగిందని టిడిపి నియోజకవర్గ రైతు అధ్యక్షులు చలపతి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బైపరెడ్లపల్లి పంచాయతీలో రైతులకు మొక్కజొన్న, పశు గ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో రైతులకు పెద్దపీట వేసి సంవత్సరానికి రూ.20వేల ఆర్థిక సాయం, వ్యవసాయ పనిముట్లు, బ్యాంకు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. గతంలో ఇజ్రాయిల్ టెక్నాలజీలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రైతులు కుప్పం ప్రాంతంలో అధికంగా పంటలు పండించి ఉమ్మడి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్, నేతలు నరేందర్ రెడ్డి, మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- డాక్టర్ లోహిత్ చంగల్ రాయులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాల్లో బాలికలకు వైద్య పరీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయని అందువలన సీజనల్ వ్యాధులు వచ్చే ఆస్కారం ఉన్నదని ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. వేడి పదార్థాలు వేడి నీరు తాగాలని అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలు పరిశుభ్రత పాటించి వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, సూపర్వైజర్ రమాదేవి, సిహెచ్ఓ దిలీప్, ఆరోగ్య కార్యకర్త రోజా రమణి, ఆశా కార్యకర్త పుణ్యవతి, వసతి గృహ నిర్వాహకులు పాల్గొన్నారు.

పరామర్శ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నేత బొజ్జారెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం పరామర్శించారు. కాగా జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంటి స్థలం వివాదానికి సంబంధించి సర్ది చెప్పడానికి వెళ్లిన బొజ్జారెడ్డిని అదే గ్రామానికి చెందిన యువకుడు కత్తితో దాడి చేసిన విషయం తెలిసింది. ఈ మేరకు తిరుపతిలో చికిత్స పొందుతున్న ఆయన్ను నారాయణస్వామి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు పద్మనాభరెడ్డి ఉన్నారు.

ఆడి కృత్తిక గోడ పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ పరిధిలోని కూసూరు గ్రామంలోని బాలసుబ్రమణ్య స్వామి దేవాలయంలో ఆడికృత్తిక గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నాగవేలు, సుందర్, గోవింద స్వామిల ఆధ్వర్యంలో పూజారి ఆర్ముగం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు.

బస్టాండ్‌లో కంపు కొడుతున్నా పట్టించుకోరా..


- మన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌టీసీ బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు కంపు కొడుతున్నా పట్టించుకోరా అంటూ మన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం అభివృద్ధి వేదిక కార్యదర్శి చైతన్య మాట్లాడుతూ ప్రతి రోజూ శుభ్రం చేయకపోవడంతో మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయన్నారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవలే ఎమ్మెల్యే బస్టాండులో మరుగుదొడ్లను పరిశీలించి కాంట్రాక్టర్‌లను ఆదేశించినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడం శోచనీయం అన్నారు. వెనువెంటనే బస్టాండ్‌లోని మరుగుదొడ్లు, ఆవరణాన్ని శుభ్రం చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మండల్ మీట్‌కు మొహం చాటేసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు మొహం చాటేశారు. ముందుగా అనుకున్న విధంగా శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే కొంత మంది అధికారులు మాత్రమే హాజరైయ్యారు. ఎంపిటీసీ, సర్పంచ్‌లు హాజరు కాకపోవడంతో మండల మీట్‌ను అధికారులు అంతలోనే ముగించేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు



- ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మనిషి పుట్టినాక ఇల్లు.. మరణించాక స్మశానం ఎంతో అవసరం. ఇలాంటి వాటి కోసం నేడు అనేకమంది ప్రజలు ఇబ్బందులు పడుతుండడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలోనే శ్మశానాల పరిష్కారాలపై చర్యలు చేపట్టాలని తహశీల్దార్‌లను కోరడం జరిగిందన్నారు. అసెంబ్లీలో కూడా ఈ విషయంపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా సుమారు 100కోట్ల ఉపాధి బిల్లులను గత ప్రభుత్వంలో ఇతర భవన నిర్మాణాలకు వినియోగించడం బాధాకరం. దీంతో ఉపాధి కూలీలు నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. పూతలపట్టు మండలం నుంచి సుమారు 1200మంది మేస్త్రీ పని చేసుకునే కూలీలు బెంగళూరుకు వలసలు వెళ్లారు. ఈ నిధులతో వీరికి ఇక్కడే పనులు కల్పించి ఉంటే మరింత ఉపయోగకరంగా ఉండేదని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్క, పాముకాట్లకు తప్పనిసరిగా మందులు ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి చెందడానికి అధికారులు సూచనలు పాటిస్తూ రైతులు ముందుకు రావాలని కోరారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న రోడ్ల వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుమారి, జెడ్పీటిసి వనజ, ఎంపీడీవో ప్రసన్నకుమారి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి, వైస్ ఎంపీపీ మురళి, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన రుచికర భోజనాన్ని అందించాలి: ఎమ్మెల్సీ



ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రభుత్వ వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆయన శుక్రవారం పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అలాగే విద్యార్థుల సౌకర్యార్థం వసతి గృహంలో ఫ్యాన్లను, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు బెడ్లు, దుప్పట్లు, తల దిండ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంపై సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ క్రమంలో త్వరలో ఎస్సీ, బీసీ వసతి గృహాలను సైతం నూతనంగా నిర్మించనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులకు చొరవ



- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని బూచివనత్తం పంచాయతీలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుక్రవారం ప్రజాశక్తిలో 'గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం' అనే శీర్షికన వార్త వెలువడింది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ తన సిబ్బందితో బూచివనత్తం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో నిలిచి ఉన్న వర్షపు నీటిని తొలగించి శుభ్రం చేయించారు. అనంతరం గ్రామంలో బురదలను తొలగించి బ్లీచింగ్ చేయించారు. దీనిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు పంచాయతీ మిట్టపల్లి హరిజనవాడలో పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి, ముళ్ళ కంపలు తొలగించారు. కార్యక్రమాన్ని ఈవోఆర్డీ లక్ష్మీదేవి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడం జరుగుతుందని ముఖ్యంగా అంటు వ్యాధులు ప్రబలకుండా మురుగునీరు నిల్వ ఉండకుండా దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జయశంకర్, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

విధిగా శిరస్త్రాణం ధరించండి



ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కార్వేటినగరం పట్టణంలో పోలీసుల సహకారంతో శిరస్త్రాణం గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం విధిగా ధరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో 90శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలు అని, శిరస్త్రాణం లేకుండా ప్రయాణం చేస్తే శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, అధ్యాపకులు ఎస్.కార్తీక్, విశ్వనాథరెడ్డి, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు





ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీలోని రామనపల్లిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై అధికారులు కొరడా ఝుళిపించారు. అంగన్వాడీకి కేటాయించిన స్థలంలో అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు అక్రమంగా షెడ్డును నిర్మించారు. ఆ మేరకు అధికారులు చేపట్టిన సర్వేలో ఆ స్థలం ప్రభుత్వ భూమిగా తేలింది. ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని వారికి చెప్పినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం అక్కడికి చేరుకున్న తహశీల్దార్ స్వర్ణలత, సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ కృష్ణయ్యలు ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణలు, షెడ్డును, రాతికూసాలను జేసీబీ సాయంతో తీయించారు.

గ్రానైట్ అసోసియేషన్ ఎన్నిక



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్ర గ్రానైట్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గ్రానైట్ యజమానులు ఎన్నుకున్నారు. శుక్రవారం విజయవాడలో అసోసియేషన్ సమావేశం జరిగింది. చిత్తూరు జిల్లా నుంచి గ్రానైట్ యజమానులు పాల్గొన్నారు. ఏపీ గ్రానైట్ అసోసియేషన్ స్టేట్ ఛైర్మన్ పి.మహేష్, వైస్ ఛైర్మన్‌గా వడ్లపాటి శేఖర్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా రాళ్ళపల్లి మోహన్ నాయుడు, కొవి మురళి, అమర్నాథ్‌ను ఎన్నుకున్నారు. వైస్ ఛైర్మన్‌గా చిత్తూరు జిల్లాకు చెందిన శేఖర్ బాబును ఎన్నుకోవడంతో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన అర్జునుని తపస్సు



ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా శుక్రవారం అర్జునుని తపస్సు భక్తులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా ఆమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమం నిర్వహించారు. గాజుల కండిగ గ్రామస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సు అందరిని ఆకట్టుకొంది. అర్జున వేషదారుడు మెట్టు మెట్టుకు పద్యాలు పాడుతూ తనతో తీసుకెళ్ళిన నిమ్మకాయలు, వీభూతి, పుష్పాలను భక్తులపైకి విసురుతూ తపస్సుమాను అదిరోహించారు. మహిళలు తడిబట్టలతో తపస్సుమాను చుట్టూ అధిక సంఖ్యలో వరపడ్డారు. నిమ్మకాయలు విభూతి కోసం యువత భక్తులు ఎగబడ్డారు. అర్జున తపస్సుని తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు పోకల సోమనాధ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, క్రిష్ణయ్యయాదవు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

తరగతి గదులు విద్యార్థులకు మార్గదర్శకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తరగతి గదులు విద్యార్థులకు మార్గదర్శకాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈశ్వర, కళ్యాణ్ అభయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు జామెంట్రీ బాక్సులు పంపిణీ కార్యక్రమం హెచ్ఎం రాజేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు అందించే నోటు పుస్తకాలు, జామెంట్రీ, బాక్సో వారిలో దాగి ఉన్న విద్య కనబడుతుందని విద్య నేర్చుకున్న వారు దేశంలో అభివృద్ధి చెందుతారని ఉద్దేశంతో దాతలు విద్య ఉపకరణాలను అందివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈశ్వర, కళ్యాణ్ అభయ ట్రస్ట్ అధినేతలు ఈశ్వర్ నాయుడు, కళ్యాణ్ నాయుడు కలిపి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు అందివ్వడం వారి దాతృత్వానికి నిదర్శనమని ఇదే విధంగా విద్య కోసం సహాయం చేసే వారిని స్వాగతం పలకాలని అన్నారు. అనంతరం నోటు పుస్తకాలు జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయప్రకాశ్ నాయుడు, ధరణి, వంశీ చౌదరి, నాగరాజు గౌడ్, ఉమాదేవి, ఎంఈఓలు నాగేశ్వరరావు రమేష్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పలువురు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల శుభ్రత



ప్రజాశక్తి-సోమల: సోమలలోని పీర్ల చావిడి వద్ద ఉన్న తాగునీటి సరఫరా ట్యాంకును శుభ్రపరిచి క్లోరినేషన్ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ తెలిపారు. ఇటీవల గ్రామంలోని పంచాయతీ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరిచి క్లోరినేషన్ చేయడం జరిగిందని అందులో భాగంగానే పీర్ల చావిడి వద్ద ట్యాంకులో నీటిని తీసి శుభ్రపరిచి క్లోరినేషన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఆధునిక హంగులతో బస్ స్టేషన్: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్థానిక బస్ స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. సెంట్రల్ బస్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. శ్రీనివాస బస్‌స్టేషన్‌లో పెచ్చులూడి వుండడాన్ని పరిశీలించారు. పార్శల్ ఆఫీసును పరిశీలించారు. శ్రీహరి బస్టాండ్‌లో దుకాణదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంఆర్ పి కే వస్తువులు అమ్మాలని సూచించారు. టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఎలక్ట్రిక్ బస్సు లో ఎమ్మెల్యే, ఇతర అధికారులు బస్టాండ్ లోని ఏడుకొండలు బస్టేషన్, పల్లెవెలుగు బస్టేషన్లను పరిశీలించారు. ఆయిల్ డిపోను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్ఎం ఆఫీసులో ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రస్తుత బస్టేషన్ స్థానంలో ఆధునిక హంగులతో కొత్తగా ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ డిజైన్, డిపిఆర్ ను ఆర్ఎం చెంగల్ రెడ్డి, డిప్యూటీ సిటీఎం భాస్కర్ లు ఎమ్మెల్యేకి వివరించారు. 13.18 ఎకరాల్లో ఐదు వందల కోట్లతో 13ఫ్లోర్స్ తో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ ను నిర్మించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అథార్టీ, రాష్ట్ర ప్రభుత్వ వాటతో పాటు థర్డ్ పార్టీ తో ఈ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. డిజైన్ తుది ఆమోద దశలో ఉందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి టెర్మినల్ విషయం తీసుకెళ్లి త్వరలో టెండర్ల పిలిచి మూడేళ్లలో కొత్త బస్టేషన్ అన్ని హంగులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. రేణిగుంట విమానాశ్రయం అందుబాటులో ఉండటంతో ఆధ్యాత్మిక నగరం ఆధునిక నగరంగా మార్చేందుకు అన్ని విధాల కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, ఈజి హేమంత్ యాదవ్, గాలి పవన్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, నెలవాయి మురళీ, మోహన్ రాయల్, సుధా పాల్గొన్నారు.

ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్ సమస్య పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు మండీ యజమానుల వినతి



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ట్రాఫిక్ సమస్య కారణంగా ఇటు మండీ యజమానులు అటు రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని పలమనేరు మండీ యజమానులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలసి విన్నవించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలసి వినతి పత్రం అందజేశారు. రైతులకు మండీ యాజమాన్యం వల్ల నష్టం వాటిల్లుతోందని పలువురు గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారని అయితే ఎందుకు ప్రధాన కారణం సరైన సమయానికి సరుకును చేర్చలేకపోతుండడమే అని పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో సుమారు 200లపైగా మండీలు ఉన్నాయని దీంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడి సరుకు సరైన సమయానికి ట్రాన్స్పోర్ట్ కాకపోవడంతో గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కాబట్టి వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని పారాయణ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ.....రైతులకు మంచి జరిగే కార్యక్రమాలు చేసేందుకు నా వంతు కృషి చేస్తానన్నారు. రైతులను ఆదుకోవాలనే గతంలో పట్టణ సమీపంలో 33 ఎకరాలలో మోడల్ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశానన్నారు. మోడల్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు జరిగితే రైతులతో పాటు మండి యజమానుల సమస్య కొలిక్కి వచ్చే వీలు ఉంటుందన్నారు. అప్పటిదాకా రైతులకు గిట్టుబాటు ధర లభించేలా మండి యజమానులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండిసుధా, రెడ్డప్ప,శంకర, నరేష్,రాజా, బుజ్జి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనలో ఎంబియు అగ్రగామి: విసి



ప్రజాశక్తి రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని ఏ రంగంపేటలో ఉన్న ఎం బి యూనివర్సిటీలో ఇంజనీరింగ్, వివిధ కోర్సులలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు మెరుగైన వేతనాలతో కూడిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎంబియూ అగ్రస్థానంలో ఉందని ఎంబియూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ రామా రావు పేర్కొన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ లో 2024-25 సంవత్సరం ఇంజినీరింగ్ బ్రాంచిల్లో అడ్మిషన్లు పొందిన నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమం దాసరి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్య నేర్పించడమే తమ లక్ష్యం అన్నారు. డీన్, ఫ్రెష్‌మెన్ డాక్టరు యన్ గిరీష్ మాట్లాడుతూ భవిష్యత్తు సవాళ్లను, అవకాశాలను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను ఈ విశ్వవిద్యాలయం అందిస్తుం దన్నారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టరు బి ఎం సతీష్ మాట్లాడుతూ మోహన్‌బాబు యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలను, సాధిం చిన వివిధ జాతీయ ర్యాంకింగ్స్, అక్రిడి టేషన్లను నూతన విద్యార్థులకు, తల్లి దండ్రు లకు వివరించారు. ముఖ్య అతిథి, రిజిస్ట్రార్ డాక్టర్ కె సారథి యూనివర్సిటీ విద్యా బోధన పద్ధతులు, తరగతి గదిలో విద్యార్థుల వ్యవహార శైలి పట్ల పలు కీలక సూచ నలు చేశారు. క్వాలిటీ స్టాండర్డ్స్‌లో ఎంబియూ టాప్ వంద ర్యాంక్‌ల లోపు ఉన్న అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలతో జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్స్, పరిశ్రమ దిగ్గజాలతో సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్ర మంలో వివిధ డీన్లు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకు సరుకులు: తహశీల్దారు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఫుడ్ బాస్కెట్ సూపర్ మార్కెట్ , కిరణ్ సూపర్ మార్కెట్‌లో సరుకులు తక్కువ ధరలకు లభిస్తాయని తహశీల్దారు కె శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని కాపు, బజారు వీధిలోని ఫుడ్ బాస్కెట్ సూపర్ మార్కెట్, కిరణ్ సూపర్ మార్కెట్‌లను తహశీల్దారు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం షాప్ యజమానులకు ప్రభుత్వ నిబంధనల మేరకు స్టీమ్డ్ బియ్యం 49 రూపాయలకు, సాధారణ రైస్ 48 రూపాయలకు, కంది పప్పు 160 రూపాయలకే అమ్మాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డిటి విష్ణు, ఇన్‌ఛార్జి ఆర్ఐ జి గురుస్వామి , విఆర్వోలు ఆశ , యశోద, పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎస్ఎన్‌ధనపాల్ , మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిఆర్ యుగంధర్, నాయకులు ఈశ్వర్, హరి, రిటైల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

గంజాయి అణచివేతకు స్పెషల్ డ్రైవ్: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో రోజురోజుకూ గంజాయి వినియోగం పెరిగిపోతున్న కారణంగా ఎన్నో దురాగతాలకు కారణమవుతుందని, ప్రశాంతమైన తిరుపతి వాతావరణాన్ని తిరిగి నెలకొల్పడానికి గంజాయి అణిచివేతకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించేలా ప్రభుత్వ దష్టికి తీసుకెళతామని టిడిపి తిరుపతి అసెంబ్లీ బాధ్యులు మన్నూరు సుగుణమ్మ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురువారం రాత్రి తిరుపతి రాయల్ నగర్ లో జరిగిన హింసాత్మక ఘటనను మత్తులో ఉన్నవారే చేయగలరన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా చేయడానికి రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడి అండతో నగరంలో ఏ చిన్న బడ్డీ కొట్టులో అయినా గంజాయి దొరికేదని ఆరోపించారు. దీని ద్వారా ఎంతో సొమ్మును వెనకేసుకున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకురాలు బ్యాంకు శాంతమ్మ, విజయ్ కుమారి, కుమారమ్మ, తరుణి, అనిత, జాహ్నవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండల అధికారులను ఆదేశించారు. కేవిబి పురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిపి మునిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకి సేవ చేసే అవకాశాన్ని అధికారులు సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల ప్రగతికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, అవి నీతికి పాల్పడకుండా నిజాయతీగా పని చేయాలని ఎమ్మెల్యే అధికారులకు హితువు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను అధికారులు, ప్రజాప్రతినిధులు గజమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం రైతు లకు ఎమ్మెల్యే చేతు ల మీదుగా పచ్చి రొట్ట విత్తనా లు పంపిణీ చేశా రు. అనం తరం మండ ల కేంద్రంలోని టిడిపి నేత బాబు దుకాణం వద్ద తక్కువ ధరలకు నిత్యా వసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి, జనసేన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే మెడికల్ డాక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వే హాస్పిటల్‌లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ తిరుపతి రైల్వే హాస్పిటల్‌కు బదిలీపై వెళ్లిన సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్‌కుమార్‌ను రైల్వే సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. గూడూరు రైల్వే హాస్పిటల్ నూతన వైద్యాధికారిగా డాక్టర్ మేఘనకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ రైల్వే సూపరిండెంట్ పల్లం వెంకటేశ్వరరావు, చీఫ్ బుకింగ్ సూపరువైజర్ ఆరేటి వెంకటేశ్వరరావు, మాజీ డిఆర్‌యు సిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కేబీఎన్ రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవికుమార్, నాగరాజ ,పెంచలయ్య, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.